క్లుప్తంగా

నేటి నుంచి వాసవి మాత జయంతి మహోత్సవాలు

పెడన: పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం నుంచి శ్రీవాసవి మాత జయంతి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ(చిన్నా) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఈ మహోత్సవాలను పురస్కరించుకుని మూడు రోజులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

31వ రోజుకు చేరుకున్న హనుమాన్‌చాలీసా పారాయణం



బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీ హనుమాన్‌చాలీసా పారాయణ శుక్రవారం నాటికి 31వ రోజుకు చేరుకుంది. వార్షికంగా శ్రీరామ నవమి నుంచి హనుమజ్జయంతి వరకు దాదాపు 40 రోజులకు పైగా భక్తులతో చాలీసా పారాయణ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గత నెల 17వ తేదీ నుంచి మొదలైన పారాయణ జూన్ ఒకటో తేదీ వరకు జరగనుంది. ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు జరుగుతున్న పారాయణ కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి భక్తులు ఆటోల్లో తరలి వచ్చి పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని హౌసింగ్ బోర్డు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆ పరిధిలోని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఈడేపల్లి శ్రీనివాసనగర్‌కాలనీ, పంచాయతీరాజ్‌కాలనీ, నారాయణపురం, పంబలగూడెం, టెంపుల్‌కాలనీ, డ్రైవర్స్‌కాలనీ, హౌసింగ్‌బోర్డు, మాచవరం, ఆనందపేట, వలందపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

కృత్తివెన్నులో..

కృత్తివెన్ను: మండలంలోని కృత్తివెన్ను, లక్ష్మీపురం, చెరుకుమిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్లలో శనివారం నిర్వహణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ ఎస్. భాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచిఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రెండో రోజు ప్రశాంతంగా ఈఏపీసెట్



పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన ఈఏపీసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు జరిగిన మొదటి సెషన్స్‌లో 90 మందికి 80 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన రెండో సెషన్స్‌లో 90 మందికి 84 మంది హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు.

వర్షంతో ఆహ్లాదకర వాతావరణం

పెడన: పెడనలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఎండ వేడిమి తగ్గింది. శుక్రవారం వేకువ జాము నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. గురువారం ఉదయం కూడా ఇలాగే పడటంతో గత రెండు రోజులుగా పెడన పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఉక్కపోతకు, ఎండ వేడిమికి తాళలేక ఇబ్బందులు పడ్డ ప్రజలు గత రెండు రోజులు నుంచి వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు సేదతీరారు.

భారీ వర్షం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచే భారీ వర్షం విడతలుగా కురుస్తుండటంతో నగరంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. నగరంలో 31.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం వరకు ఆకాశం మేఘావృతమై జల్లులు పడుతూనే ఉన్నాయి. ఆ తరువాత ఎండకాచింది. ఉదయం కురిసిన వర్షానికి కొద్దిసేపు రహదారుల్లో నీరు నిలవటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొద్ది కాలంగా అధిక ఎండలతో ఇబ్బందులు పడుతున్న నగర ప్రజలు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చల్లబడ్డ వాతావరణంతో సేద తీరారు.

మహిళా ఓటర్లే కీలకం

- అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్న మహిళలు
- ఫలితాలను డిసైడ్ చేయనున్న మహిళలు



ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గ ఫలితాన్ని మహిళా ఓటర్లు డిసైడ్ చేస్తారనే వాదనలు బలంగా వినవస్తున్నాయి. ఈ నెల 13వ తేదీ జరిగిన పోలింగ్‌లో మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమానికి మద్దతుగా మచిలీపట్నం నియోజకవర్గంలో పురుషుల కన్నా మహిళలే పోలింగ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అందువల్ల మచిలీపట్నం నియోజకవర్గ ఫలితంపై మహిళలు కీలక పాత్ర పోషిస్తారంటున్నారు. నియోజకవర్గంలో పురుషులు 94,788 మంది ఉండగా వీరిలో 78,103 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే మహిళలు 1,01,881 మంది ఉండగా వీరిలో 83,001 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో పురుషుల కన్నా మహిళలు 4,898 మంది అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,96,680 ఉండగా వీరిలో 1,61,109 మంది ఓటు వేయగా 81.91 శాతం మేర పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో 80.78 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ ఎన్నికల్లో 1.13 శాతం అధికంగా నమోదైంది. సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాటను నమ్మి 2019లో ఓటు వేసి గెలిపించిన ఓటర్లు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని పాలన సాగిస్తున్న సీఎం జగన్ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి మళ్లీ ఆయన పాలనే కావాలనే ఉద్దేశంతో ఓట్లు వేశారంటున్నారు.

పెడనలో మహిళలదే హవా

- పట్టణంలోని 21 బూత్‌లలో వారే అధికం
- పురుషులు కంటే 1,192 మంది అధికంగా ఓటు వేసిన మహిళలు

పెడన: పట్టణంలోని 25 పోలింగ్ బూత్‌లలో మొత్తం ఓటర్లు 25,281 మంది ఉంటే వీరిలో 21,706 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు అధికంగా ఉండటం విశేషం. మొత్తం ఓటర్లలో పురుషులు 12,209 మంది ఉంటే మహిళలు 13,072 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో పురుషులు కంటే మహిళలు 863 మంది అధికంగా ఉన్నారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో పురుషులు 10,257 మంది ఓటు వేస్తే మహిళలు 11,449 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పురుషులు కంటే మహిళలు 1,192 మంది అధికంగా ఓటు వేయడం విశేషం. బూత్ నెంబరు 101 నుంచి 125 వరకు ఉన్న 25 బూత్‌లలో 103, 108, 111, 113 ఈ నాలుగు బూత్‌లు మినహా మిగిలిన అన్ని బూత్‌లలో మహిళా ఓటర్లు పురుషులు కంటే అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా 124వ బూత్‌లో పురుషులు కంటే మహిళలు 95 మంది ఓటు వేయడం విశేషం.

ఆలయాన్ని జాకీలతో పైకిలేపి పునర్నిర్మాణం



బంటుమిల్లిలో జాకీల సాయంతో పైకి లేచిన ఆంజనేయస్వామి ఆలయం

బంటుమిల్లి: కాలం చెల్లిన, నేల మట్టంలో ఉన్న పాత భవంతులు, మందిరాలను పడేసి శిథిలం చేయకుండా జాకీల సాయంతో పైకిలేపి పునర్నిర్మాణం చేస్తున్న సంఘటన బంటుమిల్లి ప్రాంతంలో తొలిసారిగా చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో శ్రీ వీరాంజనేయ ఆలయం నిర్మించి సుమారు 60 సంవత్సరాలు అవుతోంది. కాలాంతరంలో వీధులు మెరక కావడంతో ఆలయం పల్లంగా మారి పూజాది కార్యక్రమాలకు అసౌకర్యంగా ఉంది. ఈ క్రమంలో పాత భవనాలు జాకీల సాయంతో పైకిలేపడం, ఇతర ప్రాంతాలకు తరలించడం తెలుసుకున్న ఆలయ ట్రస్టీ సన్నాల మస్తాన్‌రావు ఒడిశాకు చెందిన కార్మికులను సంప్రదించాడు. ఆలయాన్ని పరిశీలించిన కార్మికులు పని కాంట్రాక్టు ఒప్పందం చేసుకుని ఆలయ పునాదిని కట్ చేసి పైభాగాన్ని జాకీలు, ఐరన్ గడ్డర్లు, చెక్క కమ్ముల సాయంతో పైభాగానికి ఎటువంటి నష్టం జరగకుండా సుమారు నాలుగు అడుగులు ఎత్తు పైకి లేపారు. ఇటువంటి పనులు ఈ ప్రాంతంలో తొలిసారిగా చేపట్టడంతో స్థానికులు వచ్చి ఆసక్తిగా చూసి వెళుతున్నారు. అంతటితో ఆగకుండా స్థానికులు పలువురు వారి పాత భవనాలను పైకి లేపడానికి ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది.

నేడు రేణుక అంకమ్మ తల్లి సంబరాలు



పమిడిముక్కల: మండలంలోని హనుమంతపురం గ్రామంలో శని, ఆది వారాల్లో శొంఠి వంశస్తుల ఇలవేల్పు రేణుక అంకమ్మతల్లి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. శనివారం అమ్మవారి గ్రామోత్సవం, ఆదివారం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకొంటారని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చే శొంఠి కుటుంబీకులకు ఆలయం వద్ద అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

వేణుగోపాలుని కల్యాణోత్సవాలు ప్రారంభం



తోట్లవల్లూరులోని వేణుగోపాలస్వామి ఆలయం

తోట్లవల్లూరు: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 25 వరకు స్వామి కల్యాణోత్సవాలు జరగనున్నట్లు ఆలయ ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావు తెలియజేశారు. 17న స్వామి వారిని పెండ్లి కుమారుని అలంకరణ, 18న రుక్మిణీ, సత్యభామ అమ్మవార్లను పెండ్లి కుమార్తెల అలంకరణ, 19న విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, 20న నిత్యహోమం, బలిహరణ, 21న జాతీయ బంగారు నంది పురస్కార గ్రహీత సప్పా భారతి భాగవతారిణిచే హరికథా కాలక్షేపం, 22 రాత్రి 8 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం, 23న రథోత్సవం, 24న ధ్వజావరోహణం, రాత్రి 7 గంటలకు లక్ష మల్లెల పూజ, 25న ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ, ఉదయం 11 గంటలకు అన్నసమారాధన ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



తోట్లవల్లూరు: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తోట్లవల్లూరు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలియజేశారు. మండలంలోని గరికపర్రుకు చెందిన ఈడే నాగిని (24) శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గ్రామంలో, బంధువుల నివాసాల వద్ద ఎంత ప్రయత్నించినా ఆమె ఆచూకీ లభించలేదు. భర్త ఈడే శ్రీనివాసరావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథ్ తెలిపారు.

ఉపాధ్యాయ ఉద్యమనేత రామిరెడ్డికి ఘన నివాళి



రామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అవనిగడ్డ: ఉపాధ్యాయ ఉద్యమనేత దాచూరి రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి యూటీఎఫ్ నాయకులు ఘనంగా నివాళులరిపించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి అవనిగడ్డ మండల అధ్యక్ష, కార్యదర్శి కె.జీవేంద్రరావు, బి.శివరామకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. రామిరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయ ఉద్యమం ద్వారా రామిరెడ్డి ఎన్నో సమస్యలు పరిష్కరించడంతో కీలకపాత్ర పోషించారని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల సహాధ్యక్షుడు సింహాద్రి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు పీవీ ఆంజనేయులు, మోపిదేవి మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ స్వామి, నాయకులు బడే దాశరధి, యాసం శోభన్‌బాబు పాల్గొన్నారు.

24న పేరంటాలమ్మకు లక్ష పుష్పార్చన

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 24న విశేష లక్ష పుష్పార్చన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ భానుప్రదీప్ శుక్రవారం తెలిపారు. భాను మాట్లాడుతూ వైశాఖమాసం సందర్భంగా ఆలయంలో 24వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు మల్లెపూలతో లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రుని ఆరాధన

- వైభవంగా శ్రీగణపతి, శాంతి హోమం
- మూడువేల మందికి పైగా భక్తులకు అన్నసంతర్పణ



ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించిన దంపతులు

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి సహిత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి 331వ ఆరాధనోత్సవం, ఆలయ 18వ వార్షిక వేడుక ఘనంగా నిర్వహించారు. కాల/జ్ఞాన కర్త, సంఘ సంస్కర్త శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవ సమాధి పొందిన పవిత్ర పర్వదినం వైశాఖ శుద్ధ దశమి పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ భవిరి సుధాకర్ పర్యవేక్షణలో అర్చకుడు మహేశ్వరపు శ్రీనివాసగాంధీ నేతృత్వంలో తొలుత స్వామివారి ఆరాధనోత్సవ విశేషపూజ అనంతరం గణపతి హోమం, శాంతిహోమం నిర్వహించి, పీటలపై కూర్చున్న దంపతులతో పూర్ణాహుతి సమర్పించారు. ఉత్సవం పురస్కరించుకుని దాతలుగా రిటైర్డ్ ఎంఈఓ భవిరి శంకరనాథ్-మల్లేశ్వరి దంపతులు ఆలయంలో స్వామికి మకరతోరణాన్ని, మద్ది నాగ వెంకట సాయికుమార్-రాజ్యలక్ష్మి (హైదరాబాద్) దంపతులు విశ్వేశ్వర స్వామికి వెండి ధారాపాత్రను, భవిరి రవి శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని బహూకరించారు. దాతలు, ఆలయ కమిటీ ఆర్థిక సహకారంతో మూడు వేల మంది భక్తులకు ఆరాధన ఉత్సవంలో ప్రధానమైన అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై ఆరాధనోత్సవం తిలకించారు.



ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన క్రతువులో విశేషపూజలు చేస్తున్న దంపతులు

భక్తిప్రపత్తులతో గ్రామ బలిహరణ



ప్రత్యేక అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామ బలిహరణను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రత్యేక పల్లకిలో బలిహరణ స్వామిని గ్రామంలో ఊరేగించారు. ఉదయం లింగాకారుడికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలను నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ హోమలను జరిపారు. బాలాత్రిపుర సుందరీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చనను నిర్వహించి, ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. శనివారం రాత్రికి స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుధాకర్ తెలిపారు. కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాల ప్రదర్శనలు ఉంటాయని ఈఓ తెలిపారు.

నేడు అమ్మవారి జన్మదిన మహోత్సవం



బ్రోచర్‌లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: స్థానిక వాసవిచౌక్‌లో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి 4,641వ జన్మదిన వేడుకలు జయప్రదం చేయాలని ఆలయ పాలకవర్గ సభ్యులు కోరారు. శుక్రవారం ఆలయ కార్యాలయంలో మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం అమ్మవారి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 5 గంటలకు 108 కలశాలతో అమ్మవారికి అభిషేకాలు, 8 గంటలకు పట్టుచీర సమర్పణ అనంతరం 102 మంది బాలకన్యకలకు విశేష పూజలు, 10 గంటలకు 108 మంది సుహాసినిలతో సహస్ర పుష్పార్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కేసరపల్లికి చెందిన కమలానంద భారతి స్వామి వారి ప్రవచనం కార్యక్రమం ఉంటుందన్నారు. 12 గంటలకు పెద్ద సంఖ్యలో అన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 5 గంటలకు మేళతాళాలు, చండీమేళం, శక్తి వేషాలు, తీన్మార్, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి నగర సంకీర్తన జరుగుతుంది. ఆలయ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, అదనపు కార్యదర్శి సముద్రాల వెంకట జగ్గారావు, కోశాధికారి టంగుటూరి వెంకట సుబ్బారావు, ఎక్కల మణిదీప్, ఎండూరి బాలాజి, కూరళ్ల శ్యామ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో నేల సారవంతం



ప్రొద్దుటూరులో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ కిరణ్

కంకిపాడు: పచ్చిరొట్ట పైర్ల సాగుతో నేల సారవంతంగా మారుతుందని మండల వ్యవసాయాధికారి పిఎం.కిరణ్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో పచ్చిరొట్ట విత్తనాలను శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ కిరణ్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం పెరగడంతో నేల సారం కోల్పోయి దిగుబడులు తగ్గిపోతున్నాయని అన్నారు. పచ్చిరొట్ట పైర్లను సాగు చేయడం ద్వారా భూమికి అవసరమైన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని తెలిపారు. పచ్చిరొట్ట పైర్లు భూమిలో కలియదున్నడం వల్ల సేంద్రీయ పదార్థాలు, పోషకాలు వృద్ధి చెంది దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. 50 శాతం రాయితీపై జీలుగ, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 10 కిలోలు జీలుగ బస్తా పూర్తి ధర రూ. 880 కాగా 50 శాతం రాయితీపై రూ. 440కి అందిస్తున్నామని పేర్కొన్నారు. పిల్లిపెసర 8 కిలోల బస్తా పూర్తి ధర రూ. 1,072 కాగా, 50 శాతం రాయితీపై రూ. 536కి అందిస్తున్నామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ విజయ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు

ఉంగుటూరు: స్థలవివాద విషయంలో ఇరువర్గాలపై ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు గన్నవరం మండలం దావాజీగూడెంకు చెందిన మొఘల్ షాజా, మొఘల్ బాజీ ఇరుకుటుంబాల వారు, వారి బంధువుల ఇళ్లు పక్కనే ఉంటాయి. వీరి మధ్య కొన్నేళ్లుగా స్థల వివాదం ఉంది. ఈ వివాదం పరిష్కారం కోసం ఉంగుటూరు మండలం ఆత్కూరులో ఈ నెల 16వ తేదీ రాత్రి పంచాయతీకి ఇరువర్గాల వారు వెళ్లారు. మొఘల్ షాజా కుటుంబ సభ్యులకు పంచాయతీ ఇష్టం లేకపోవడంతో బయటకు వచ్చి వెళుతుండగా ఆత్కూరు సెంటర్లో బాజీ బంధువులు రాడ్లతో దాడి చేశారు. గాయపడిన షాజా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హాస్పిటల్ ఇంటి మేషన్ ద్వారా ఫిర్యాదు చేశారు. బాజీ కుటుంబ సభ్యులు కూడా తమను దాడి చేసి బెదిరించారని ఆత్కూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పైడి బాబు ఇరువర్గాలవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అస్తమయ వేళ భానుడి వింత సోయగం

వెండి మేఘాల ఆరావళిలా మురిపించిన గగనతలం



కృష్ణవేణమ్మ విగ్రహానికి తైలవర్ణచిత్రంలా మేఘాల గొడుగు



మేఘాల వరుసతో భగభగ మండుతూ వెండి, బంగారు కిరణాలతో పడవకు సోయగం

వాతావరణంలో సంభవించిన మార్పుల నేపథ్యంలో శుక్రవారం పగలంతా వర్షం జోరుగా కురిసింది. సాయంత్రం ఐదు గంటల నుంచి సూర్యుడు మండుతూ నీలాకాశంలో దూసుకురావడంతో ఎండ ప్రచండమైంది. అంతేకాకుండా సూర్యాస్తమయ సమయంలో నాగాయలంక కృష్ణానది పశ్చిమ తీరాన గగనతలంలో రజిత కాంతుల తైలవర్ణచిత్రంలా మేఘాలు ఆవిష్కృతమై సందర్శకులను మురిపించింది. సాయం సంధ్యవేళ సూర్యుడు తెల్లటి అగ్నిగోళంలా మేఘాల సమ్మేళనంతో వివిధ వర్ణ సోయగం వెదజల్లడంతో అచ్చెరువు కలిగించిన దృశ్యాలు ఇవి.. కృష్ణానదిలోని కృష్ణమ్మ తలపైగా మేఘాల ఛత్రంలా కమ్ముకుని చాలసేపు అలరించాయి. సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో గంటన్నర సేపు ఎండ తీవ్రత ప్రదర్శించడంతో నదీతీరంలో సేద తీరేందుకు వచ్చిన సందర్శకులు, గ్రామస్తులు ఎండకు అమ్మో అన్నారు. మరోవైపు రజత మేఘాలు వర్ణాల సమ్మేళనం కాన్వాస్‌పై చిత్రకారుడు అద్దిన అద్భుతంగా ఆకాశంలో ఆవిష్కృతమై కనువిందు చేసింది. బంగారు, వెండి రంగుల సూర్యకిరణాలు కృష్ణానదిలో చిరు అలలపై మెరుపులు చిందించడంతో ఆ వెలుగుల్లో నాటు పడవల రాకపోకలు సొగసైన ప్రకృతి దృశ్యాలను జోడించి సాక్షి కెమెరా క్లిక్ చేసింది.

– నాగాయలంక(అవనిగడ్డ)